క్లుప్తంగా

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): 29వ డివిజన్ మధురానగర్ నేతాజీ కాలనీలో శనివారం కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఎంపిక చేశారు. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, నగర మహిళ అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేని, కోలా రమేష్, ఎస్కే బాబు పాల్గొన్నారు.

నకిలీ రిజిస్ట్రేషన్ల కేసులో మరో ఇద్దరు అరెస్ట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డూప్లికేటు గాళ్లకు తమ ఆధార్ కార్డులిచ్చి నకిలీ రిజిస్ట్రేషన్లకు సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం గవర్నర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ రిజిస్ట్రేషన్ల కేసులో ఇప్పటివరకు మొత్తం ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని పెజ్జోనిపేటకు చెందిన దారా కన్నయ్య, ఒంటిపులి విజయ తమ పేరుతో ఉన్న ఆధార్‌కార్డులను డూప్లికేటు గాళ్లకు అందిస్తారు. వాటి ఆధారంగా వారు వేరేపేర్లతో ఆధార్ కార్డుల తయారు చేసి, నకిలీ రిజిస్ట్రేషన్లకు వాడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో వారి పాత్ర నిర్ధారణ కావడంతో వారిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరికొందరి పాత్ర ఉందని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

రెండు బారుల్లో రూ.33 వేల చోరీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట పీఎస్ పరిధిలోని రెండు బార్‌లో దొంగతనం జరిగింది. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగిందని పటమట పోలీసులు చెప్పారు. ఇందులో ఒక బార్‌లో రూ.18వేలు, మరొక బార్‌లో రూ.15 వేలు గుర్తుతెలియని వ్యక్తులు నగదును దొంగిలించినట్టు పోలీసులు తెలిపారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని చెప్పారు. దొంగతనం జరిగిన వెంటనే పోలీసులు అక్కడకు వెళ్లి బార్‌ల యజమానుల నుంచి జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో బాలిక అదృశ్యం కావటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు రాయలవారి వీధికి చెందిన పీతా సాంబశివరావు కుటుంబం నివసిస్తోంది. అతని కుమార్తె (17) పది చదివి పప్పుల మిల్లు వద్ద షాపులో పని చేస్తుంది. అయితే గురువారం పనికని ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైంది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెదికినా ఆమె జాడ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఘనంగా సినీనటుడు శోభన్‌బాబు జయంతి



శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శోభన్ సిండికేట్ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు లాకుల సెంటర్‌లో స్టేట్‌వైడ్ శోభన్ సిండికేట్ ఆధ్వర్యంలో సినీ నటుడు శోభన్ బాబు 87వ జయంతి కార్యక్రమం జరిగింది. స్టేట్ వైడ్ శోభన్ సిండికేట్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కళ్లే పల్లి మధుసూదనరాజు, డాక్టర్ డి.సత్యనారాయణలు శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పైడిపాటి వెంకన్న, ఆరిస్ట్ వెంకన్న, సలీం, ఎక్స్‌రే కార్యదర్శి బి.ఆంజనేయ రాజు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ పాల్గొన్నారు.

సంక్రాంతి ప్రతి ఇంటా కొత్త వెలుగులు నింపాలి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. మూడురోజులపాటు జరిగే సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గంలో శనివారం తెల్లవారుజామున భోగి మంట వేశారు. 23వ డివిజన్ బీసెంట్ రోడ్డులో భోగి వేడుకలను వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, డివిజన్ కో–ఆర్డినేటర్ ఒగ్గు విక్కీలతో కలిసి మల్లాది విష్ణు ప్రారంభించారు. బీసెంట్ రోడ్డులో ఎమ్మెల్యే భోగి మంట వేశారు. యువత, మహిళలు కేరింతలు కొడుతూ సందడి చేశారు. తమ కష్టాలు, బాధల్ని అగ్ని దేవుడికి ఆహుతి చేస్తూ సుఖసంతోషాలు ప్రసాదించాలని, భోగి మంటల చుట్టూ తిరుగుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఏటా బీసెంట్ రోడ్డులో భోగి వేడుకలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు తెలిపారు. ఈ వేడుకలతో నగరానికి పల్లె కళ వచ్చిందన్నారు. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు 'సంక్రాంతి' ప్రతీక అని మల్లాది విష్ణు అన్నారు. కష్టించి పండించిన పంట సిరి చేతికొచ్చిన ఆనందంలో కళ్ళల్లో విరిసే కోటి కాంతులతో రైతన్నలు ఈ పండగను జరుపుకుంటారని తెలిపారు. కనుమ నాడు వ్యవసాయ నేస్తాలైన పశువులను పూజిస్తారన్నారు. అటువంటి అన్నదాతల విషయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కన్న కలలను.. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెన్నం రత్నారావు, చినబాబు, చల్లా సుధాకర్, అంజిబాబు, బెజ్జం రవి, తోపుల వరలక్ష్మి, ఝాన్సీరాణి, పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కుట్రలన్నీ భోగి మంటలతో అంతం కావాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్ర రాజకీయాలన్నీ భోగి మంటలతో అంతం కావాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురం శివాజీ కేఫ్ సెంటర్లో జరిగిన సంక్రాంతి సంబరాలలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి ఆయన భోగి మంటలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఈ పండగ భోగ భాగ్యాలు, సిరి సంపదలను తీసుకురావాలని ఆకాంక్షించారు. భోగి మంటలు కేవలం చలి నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికే కాదని, ఇందులో ఆరోగ్య రహస్యం కూడా దాగుందన్నారు. పశువుల పేడతో చేసిన పిడకలను వాడటం ద్వారా గాలిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుందన్నారు. ఈ సంక్రాంతి మనందరికీ ఎంతో ప్రత్యేకమైనదని మల్లాది విష్ణు చెప్పారు. పింఛన్ పెంపు, వైఎస్సార్ తోడు వంటి కార్యక్రమాలతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెట్టింపు ఆనందాన్ని నింపారన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో లక్షన్నర మంది ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను లబ్ధి పొందినట్లు వివరించారు. దుర్గమ్మ తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ కో–ఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు లంకా బాబు, ఓగిరాల రాజశేఖర్, కంభంపాటి ప్రసాద్, కొల్లూరు రామకృష్ణ, ఉప్పు రంగబాబు, కోలవెన్ను కొండ, నాళం బంగారి, కూనపులి ఫణి, సనత్, చామర్తి మూర్తి, గోపాలకృష్ణ, చాంద్ శర్మ, దుర్గారావు, రమణమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.



బీసెంట్ రోడ్డులో భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



శివాజీకేఫ్ సెంటర్‌లో భోగి మంటలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. 62వ డివిజన్ సంతోషమాత గుడి వద్ద జీవనది ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గులపోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముగ్గుల పోటీల్లో విజేతలకు కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి బహుమతులను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, రామిరెడ్డి, బుజ్జి, రమేష్, హైమావతి, యోహాను, జీవనది ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

57వ డివిజన్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 57వ డివిజన్‌లో సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఇసరపు దేవి, సింగ్‌నగర్ సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసరపు రాజు, మల్లెల చెన్నకేశవరెడ్డి, కాళ్ల ఆదినారాయణ, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటా భోగ భాగ్యాలు వెల్లి విరియాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని షిరిడీసాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీషిరిడీసాయిబాబా మందిరంలో శనివారం భోగి పండగ సందర్భంగా చిన్నారులకు భోగిపండ్లు పోసే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తొలుత బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

సర్వ మానవాళిలో భగవంతుడిని చూసుకోవాలి

విజయవాడ కల్చరల్: సర్వమానవకోటిలోనూ భగవంతుడిని చూసుకోవాలని అదే మహర్షులు మనకు అందించిన దివ్యసందేశమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నరసింహాచార్యులు ఉపదేశించారు. శ్రీ కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు శనివారం ముగిశాయి. నరసింహాచార్యులు మాట్లాడుతూ శివ కేశవులకు భేదం లేని మాసం ధనుర్మాసమని వివరించారు. గోదాదేవి రంగనాథుని ప్రసన్నం చేసుకోవడానికి పాశురాలను రచించి గానం చేసిందన్నారు. పాశురాలను తిరుప్పావైగా కూడా సంభాషిస్తారన్నారు. వాటి పఠనం శ్రవణం ముక్తికి మార్గంగా భావిస్తారన్నారు. నెల రోజులపాటు ధనుర్మాసం సందర్భంగా భగవత్ కైంకర్యంలో పాల్గొన్న అర్చక స్వాములను భక్తులు ఆత్మీయంగా సత్కరించారు.



తిరుప్పావై అంశంగా ప్రసంగిస్తున్న నరసింహాచార్యులు

జోరుగా కోడి పందేలు

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు ప్రాంతాలైన జక్కంపూడి పాముల కాల్వ వద్ద, పైపులరోడ్డును ఆనుకుని ఉన్న అంబాపురం గ్రామ పంచాయతీ ఒకటో వార్డులో కోడిపందాలు శనివారం నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు కోడిపుంజులను తీసుకొచ్చి వేశారు.

కనులపండువగా గోదారంగనాథ స్వామి కల్యాణం



దాసాంజనేయస్వామి ఆలయంలో కల్యాణం



గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా గోదారంగనాథస్వామి కల్యాణం శనివారం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ పర్యవేక్షించారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడు శ్రీషిరిడీసాయిబాబా మందిరంలో శనివారం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన స్వామి కళ్యాణం జరిగింది. కార్యక్రమంలో ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాదేవి ధనుర్మాసంలో పూజలు చేసి స్వామిని ప్రసన్నం చేసుకుందో అదేవిధంగా ప్రజలు స్వామి అనుగ్రహం పొందాలని సూచించారు. అనంతరం కళ్యాణం చేసిన తులసి మాలను వివాహం కాని యువతీ యువకుల మెడలో వేసి పూజలు చేశారు. కార్యక్రమాలను పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శనివారం ధనుర్మాసోత్సవాలలో భాగంగా స్వామి కల్యాణం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో శనివారం రంగనాథ సమేత గోదాకల్యాణ కార్యక్రమాన్ని అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవారి సేవాదళ్ కార్యకర్తలు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

లబ్బీపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో..

లబ్బీపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా గోదాదేవి కల్యాణం శాస్త్రీయంగా నిర్వహించారు. దుర్గాపురంలోని శివరామకృష్ణక్షేత్ర సముదాయంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా కల్యాణం నిర్వహించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవాలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నిత్యం తిరుప్పావై పఠనంతో పాటుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకుని సాయంత్రం ఆలయ ప్రాంగణలోని కల్యాణవేదికపై గోదాదేవిరంగనాథుల కలాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్ బాబు పర్యవేక్షించారు.

పాండురంగని కల్యాణం

కొత్తగుళ్లు ప్రాంగణంలోని పాండురంగస్వామి సన్నిధిలో రుక్మాబాయి సమేత పాండురంగని కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.

కోదండ రామాలయంలో..

కొత్తగుళ్లు ప్రాంగణంలోని కోదండరామాలయంలో గోదాదేవి కల్యాణాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు నిర్వహించారు.

నగరాల రామాలయంలో..

కొత్తపేట కోమలవిలాస్ సెంటర్ సమీపంలోని నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో భోగి పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు



ఆటోనగర్(విజయవాడ తూర్పు): సంక్రాంతి ముందు స్పెషల్ డ్యూటీ ఇష్టపడి చేసిన ప్రతి ఉద్యోగిని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ఆటోనగర్ డిపో ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎండీ సందేశాన్ని డిపో డీఎం ప్రవీణ్‌కుమార్ ఉద్యోగులకు చదివి వినిపించారు. అదేవిధంగా సంక్రాంతి అనంతరం నాలుగు రోజులు కూడా సిబ్బంది అంకితభావంతో పనిచేసి, ఆర్టీసీ ఆదాయానికి కృషిచేయాలని ఆ సందేశంలో ఎండీ పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా అయ్యప్ప జ్యోతి దర్శనం

వన్‌టౌన్: అయ్యప్ప స్వామి వారి సన్నిధిలో జ్యోతి దర్శనం కార్యక్రమాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాతబస్తీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లోని కొలువై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి సన్నిధిలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకారం అనంతరం ఆలయంపై భాగం నుంచి జ్యోతి దర్శనాన్ని అందించారు. అర్చక స్వాములు మురళీధరన్ నంబూద్రి స్వామికి కేరళ సంప్రదాయ రీతిలో విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఇంద్రకీలాద్రి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో..

నెహ్రూబొమ్మ సెంటర్‌లో దుర్గాశి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిని వెలిగించారు. అదే సమయంలో ఇంద్రకీలాద్రి పైన ఉన్న అయ్యప్ప స్వామి సన్నిధిలో జ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ 51వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మరుపిళ్ల రాజేష్, దుర్గాశి కిరణ్ పాల్గొన్నారు.



అయ్యప్పకు వెలంపల్లి ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వామి సన్నిధిలో జ్యోతి దర్శనం